క్లుప్తంగా

ఎంపీడీఓకు ఘనంగా వీడ్కోలు



సామర్లకోట ఎంపీడీఓను సత్కరించిన ఎంపీపీ తదితరులు

సామర్లకోట: మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలిగా ఏడాదిన్నర కాలంలో మండలాభివృద్ధికి ఎంపీడీఓ డి.శ్రీలలిత విశేషమైన కృషి చేశారని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పలువులు వక్తలు పేర్కొన్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి వెళ్తున్న ఆమెకు స్థానిక నాయకులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఏఓ, వైఎస్సార్ క్రాంతి పథంలో అందరూ మహిళలు ఉండటంతో పరిపాలన ఏ విధంగా జరుగుతుందోనని భయపడ్డానని, అయితే ఎంపీడీఓ శ్రీలలిత అన్ని శాఖలను సమన్వయం చేస్తూ సమస్యలు లేని గ్రామాలుగా తయారు చేశారని ఎంపీపీ సత్తిబాబు తెలిపారు. అటువంటి ఎంపీడీఓ బదిలీ కావడం బాధగా ఉన్నా ఎన్నికల తరువాత తిరిగి ఆమెను సామర్లకోటకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పరిపాలనాధికారి మంగతాయారు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఆమె సేవలను కొనియాడారు.

వంద రోజుల పని దినాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని చేసే కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై మేట్లకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తించిన పనులకు చిత్రాలు తీసి వాటిని అప్‌డేట్ చేయాలన్నారు. జాబ్‌కార్డు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి 90 రోజులు పని దినాలను వేయాలన్నారు. పని కావాలన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత మేట్లపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం సంకీర్తనలో వేట్లపాలెం భజన బృందం

సామర్లకోట: అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న 8వ అఖండ భగవన్నామ సంకీర్తనలో వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి భజన మండలి సభ్యులు పాల్గొంటున్నట్లు ఆలయ ధర్మకర్త పెండాల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం నగర సంకీర్తన, ఒకటవ తేదీన విష్ణు సహస్ర పారాయణ, రెండున శ్రీలలిత సహస్ర నామ పారాయణ, 3వ తేదీన వేంకటేశ్వర గోవిందనామ గానామృతం, 4న శ్రీభగవద్గీత పారాయణ, 5న శివ సహస్ర నామ పారాయణ, ఆరున హనుమాన్ చాలీసా పారాయణ ఉంటాయని తెలిపారు. 7వ తేదీన పూర్ణాహుతి, శాంతికల్యాణం జరుగుతుందని ఆయన చెప్పారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతి



వెంకట్రావు (ఫైల్)

సామర్లకోట: జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసి పదవీ విరమణ చేసిన ఎం.వెంకట్రావు (79) బుధవారం మృతి చెందారు. ఈ మేరకు పలువురు సంతాపం తెలిపారు. వెంకట్రావు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చిన్ననాటి స్నేహితుడు కావడంతో మృతుని కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపం తెలిపారు.

రైతు బిడ్డకు స్వర్ణ పతకం



గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి నుంచి స్వర్ణ పతకం అందుకుంటున్న విజయలక్ష్మి

కరప: మండలం కూరాడ గ్రామానికి చెందిన రైతు వెలుగుబంట్ల రవినాయుడు (సురేష్) కోడలు వీరంరెడ్డి విజయలక్ష్మి పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో స్వర్ణ పతకం సాధించింది. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో 2020–22 విద్యా సంవత్సరంలో ఆమె ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ చదివారు. వర్సిటీ పరిధిలోని 60 కళాశాలల్లో మొదటి స్థానంలో నిలిచి ఈ ఘనత సాధించింది. బుధవారం వర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి చేతుల మీదుగా ఆమె స్వర్ణ పతకం అందుకున్నారు. కూరాడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెలుగుబంట్ల సూరిబాబు, మాజీ సర్పంచ్ రావుల ప్రసాద్ తదితరులు ఆమెను అభినందించారు.

ఆరోగ్య సురక్షను శిక్షగా చేయొద్దు

- వైద్యారోగ్య శాఖాధికారులపై ఎంపీ వంగా గీత ఆగ్రహం
- రోగులకు దూరంగా క్యాంపు పెట్టడంపై ఫైర్
- అందుబాటులోనే ఆరోగ్య సురక్ష శిబిరాలు ఉండాలంటూ ఆదేశం



అధికారులను ప్రశ్నిస్తున్న కాకినాడ ఎంపీ వంగాగీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజలందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలు అందాలనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే దానికి భిన్నంగా రోగులకు దూరంగా ఏర్పాటు చేయడమేమిటంటూ కాకినాడ ఎంపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత వైద్య అధికారులపై మండిపడ్డారు. పిఠాపురం మంగయ్యమ్మ రావు పేట అర్బన్ హెల్త్ సెంటర్లో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె రోగులు తక్కువగా ఉండడాన్ని గమనించారు. ఇంత మంది వైద్యులతో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తే రోగులు ఎవరు ఎందుకు రాలేదని ఆరా తీశారు. దీంతో పట్టణంలోని మోహన్‌నగర్ సచివాలయానికి సంబంధించి వైద్య శిబిరం ఇక్కడ ఏర్పాటు చేశారని సిబ్బంది తెలిపారు. సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోహన్‌నగర్ చెందిన రోగులకు ఇక్కడ శిబిరం ఏర్పాటు చేయడమేమిటని ఈ కార్యక్రమానికి వచ్చిన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి నరసింహనాయక్, పిఠాపురం సీహెచ్‌సీ సూపరింటిండెంట్ సుజాత, మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావును నిలదీశారు. ఎక్కడో దూరంగా ఉన్న రోగులు ఇక్కడకు ఎలా వస్తారని ఏర్పాటు చేశారంటూ మండిపడ్డారు. ప్రతి వార్డు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించి తీరాలని తద్వారా ఆ వార్డు ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందాలన్నారు. ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిస్తే చూస్తు ఊరుకునేది లేదని వైద్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే రోగంతో బాధ పడుతున్న రోగులు శ్రమ కోర్చి ఆస్పత్రులకు రాలేరనే ఉద్దేశంతోనే ఈ శిబిరుల నిర్వహిస్తున్నారని అలాంటి శిబిరాసలు దూరంగా ఏర్పాటు చేస్తే ఇక ప్రభుత్వ ఆశయం ఎలా నెరవేరుతుందని ఆమె అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పెండెం దొరబాబు సైతం అధికారుల తీరును దుయ్యబట్టారు. ఎన్నో నిధులు వెచ్చించి రోగుల చెంతకే వైద్యం అందేలా సీఎం జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తే వాటిని ఇలా తూతూ మంత్రంగా నిర్వహించడమేమిటని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఇక నుంచి ప్రతి వార్డు సచివాలయ పరిధిలోను ఆరోగ్య శిబిరం నిర్వహించాలని లేకుంటే అధికారుల తీరును ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన హెచ్చరించారు. ఇకపై అలా జరగకుండా అన్ని సచివాలయాల పరిధిలోను జరిగే విధంగా చూస్తామని అధికారులు నేతలకు హామీ ఇచ్చారు.

బ్రౌన్‌పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట అంబేడ్కర్ పార్కులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం ఉండాలన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రోగులకు మందుల కిట్లను అందజేశారు. కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, వైద్యులు కిరణ్, జ్యోతి, సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

నిధులు దుర్వినియోగంపై సభ్యుల ఆగ్రహం

- గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ కౌన్సిలర్లు

పిఠాపురం: నగర పంచాయతీలో చేయని పనులకు, చేసిన పనులకు అధిక బిల్లులు చూపించి నిధులు దుర్వినియోగం చేస్తున్నారంటూ పలువురు కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి, గంటా అప్పలస్వామితో పాటు పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ సామర్లకోటలో ఇటీవల నిర్వహించిన సీఎం సభకు జనాన్ని ఆటోల్లో తరలించినట్టు దీని కోసం రూ.2 లక్షలు ఖర్చు చేసినట్టు బదిలీపై వెళ్లిన కమిషనర్ సత్యనారాయణ రికార్డుల్లో చూపించారని అసలు సీఎం సభకు ఆటోలే పెట్టలేదని అధికారులను నిలదీశారు. దీనికి సంబంధించిన ఖర్చుల వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు రూ.లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపిస్తున్నారని నిజానికి అంత ఖర్చు కాలేదని దీనిపై వివరణ ఇవ్వాలని సభ్యులు పట్టుబట్టారు. దీనిపై మేనేజర్ రాంప్రసాద్ వివరణ ఇవ్వడానికి ప్రయత్నించగా సంబంధిత అధికారులు సమావేశానికి హాజరు కాకుండా సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారని నిలదీశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఏఈ ప్రభాకర్, ఇతర అధికారులు సమావేశంలో సభ్యులకు సమాధానం చెప్పవసి వస్తుందని ఉద్దేశ్య పూర్వకంగానే విధులకు హాజరు కాలేదని సభ్యులు ఆరోపించారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా కొన్ని పనులకు నిధులు ఖర్చు చేయడంపై పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జనరల్ ఫండ్‌కు మాత్రమే కౌన్సిల్ అనుమతి అవసరమని మిగిలిన నిధులు ఖర్చుకు అనుమతి అవసరం లేదని ఉన్నతాధికారుల అనుమతితో చేయవచ్చని అధికారులు తెలపగా ఈవిషయాన్ని లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కౌన్సిలర్ గంటా అప్పలస్వామి కోరారు. నగర పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా వేస్తున్న లేఅవుట్లపై వివరాలు తెలపాలని పలువురు సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా ప్రగతే లక్ష్యంగా పాలన

- వైఎస్సార్ ఆసరా పంపిణీ సభలో దవులూరి
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, నాయకులు

సామర్లకోట: మహిళా ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని ఇస్మాయిల్‌నగర్, గోలివారి వీధి, బళ్లమార్కెట్, బలుసులపేట సచివాలయాల పరిధిలోని మహిళా సంఘాలకు తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో అవినీతికి ఆస్కారం లేదని చెప్పారు. మహిళా సంఘాలపై భారం లేకుండా సీఎం జగన్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళా వ్యాపారవేత్త కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపించడంతో మాయ మాటలు చెప్పేవారు వస్తారని దవులూరి హెచ్చరించారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ప్రజలకు మేలు చేసిన పథకాలు లేవని దొరబాబు గుర్తు చేశారు. మహిళలకు జరుగుతున్న మేలును దృష్టిలో ఉంచుకుని జగన్ మోహన్‌రెడ్డిని జీవిత కాలం ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. ప్రజలకు మేలు జరిగిందనుకుంటేనే తనకు ఓటు వేయాలని ముఖ్యమంత్రి పిలుపు ఇస్తున్నారని చెప్పారు. ప్రజలు పొరపాటున వైఎస్సార్ సీపీకి అవకాశం ఇవ్వక పోతే సంక్షేమ పథకాలు అమలు అయ్యే అవకాశం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం జగన్ ఇచ్చారని నియోజకవర్గ ప్రజలు మెచ్చుకునేలా ప్రజలకు సేవలు చేస్తానని దొరబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు నమూనా చెక్కును అందజేశారు. పట్టణ పరిధిలోని నాలుగు సచివాలయాలలోని 192 మహిళా సంఘాలకు నాలుగో విడత ఆసరాలో రూ.1,36,75,827 బ్యాంకు ఖాతాలలో జమ అయినట్లు మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత తెలిపారు. మహిళలు జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అధ్యక్షత వహించగా మరో వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, కమిషనర్ జె. రామారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్యదర్శి ముడికి సోనియామేరీ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, అధికార పార్టీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు బల్లకట్టు వద్ద వ్యక్తి గల్లంతు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ శివారున ఉన్న బల్లకట్టు వంతెన వద్ద బుదవారం ఒక వ్యక్తి గల్లంతైనట్లు పోలీసులు తెలిపారు. వంతెన పై నుంచి గుర్తు తెలియని వ్యక్తి దూకినట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాయచారం ఇచ్చారు. దీనిపై గొల్లప్రోలు పోలీసులతో పాటు పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టారు. అయితే ఎటువంటి ఆచూకీ లభించలేదని అధికారులు తెలిపారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

కిర్లంపూడి: చేపల చెరువులకు కోడి వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్ చేసినట్లు ఎస్సైషేక్ జబీర్ తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ బి.రాజేంద్ర మాట్లాడుతూ చేపల చెరువులలో కోడి వ్యర్థాలు వేస్తున్నారని, తద్వారా నీరు కలుషితమవుతుందని ఫిర్యాదులు అందాయన్నారు. చెరువుల నిర్వాహకులకు నోటీసుల జారీ చేసినా వారు తీరు మారలేదన్నారు. దీంతో బుధవారం మండల కమిటీ చేసిన ఆకస్మిక తనిఖీల్లో రామచంద్రపురంలో చెరువులకు కోడి వ్యర్థాలు, డ్రమ్ములు తరలిస్తున్న ఏపీ31టీఈ6231 వ్యాన్‌ను పట్టుకున్నామన్నారు. వ్యాన్‌లో ఉన్న వ్యర్థాలను జగపతినగరం మార్కెట్ యార్డు ఖాళీ ప్రదేశంలో గొయ్యితీసి పాతిపెట్టారు.

కాలువ కనిపిస్తే చాలు ఆక్రమించేస్తున్నారు..



ఉప్పాడ- అమినాబాద్ రోడ్డులో ఆక్రమించిన ప్రధాన కాలువ



అమినాబాద్‌లో ప్రధాన కాలువను ఆక్రమించిన దృశ్యం



ఉప్పాడ సెంటర్లో ప్రధాన రోడ్డులో ఆక్రమించిన కాలువ

కొత్తపల్లి: పంట కాలువలు కనిపిస్తే చాలు.. ఆక్రమించేద్దామనే ఆలోచలనలో ఉన్నారు అక్రమణదారులు. ఎందుకంటే అడిగేవారు ఉండరనే ధీమా. ఇంకే ముంది అనుకుందే తడవుగా కాలువలు పూడ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ దృష్టికి రాలేదు ఈ వ్యవహారం. మండలంలోని ఉప్పాడ, అమినాబాద్‌లో ఉన్న ప్రధాన కాలువలు సైతం ఆక్రమించి ఆ స్థలాలను లే అవుట్లలో కలిపేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు గమ్మున ఉండడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎటువంటి తూరలను ఏర్పాటు చేయకుండా ఇళ్లకు రోడ్లు, రోడ్లు నిర్మిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. తుపాన్ల సమయంలో హడావుడి చేసే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కాలువలను ఆక్రమిస్తున్నా పట్టించుకోకపోవడంపై ఆంతర్య ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్తపల్లి–ఉప్పాడ, ఉప్పాడ–అమినాబాద్ మీదుగా సముద్రంలోకి వెళ్లే ప్రధాన కాలువ సైతం పూర్తిగా ఆక్రమణకు గురైంది. తుపాన్లు ఏర్పడితే ముంపునీరు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడుతుందని వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

జాబ్‌మేళాకు 130 మంది ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: నాగులాపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి, సర్పంచి వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, వికాస ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంటు సర్వీసెస్ సంయుక్తంగా మెగా జాబ్‌మేళా నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి సుమారు 650 మంది హాజరు కాగా వీరిలో 130 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. ఈ మేళాలో ఎంఎన్‌సీ కంపెనీతో పాటు ఫార్మా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ మేళాలో వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, సర్పంచులు నక్కా మణికంఠ, కంబాల మౌనిక, నాగులాపల్లి ఉప సర్పంచి గుబ్రాల చిరంజీవి కుమార్, ఎంపీటీసీ యల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజయమే మా ఆనందం



రామాచార్యుల దంపతులను సత్కరిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: తమ వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే ఆ ఉపాధ్యాయులకు కలిగే ఆనందం డబ్బుతో వెలకట్టలేనిదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీకే రామాచార్యులు అన్నారు. రమణక్కపేట జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు రామాచార్యులు పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు రామాచార్యుల దంపతులను పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి విద్యేనన్నారు. విద్యాబుద్ధులు నేర్చుకోవడం వల్ల ఉన్నత స్థాయికి ఎదుగుతారని బోధించారు. ఎంతో మంది గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. తమ వద్ద విద్యను నేర్చుకున్న విద్యార్థులు గ్రామానికి, దేశానికి ఉపయోగపడేలా పేరు ప్రఖ్యాతలు సాధించాలన్నారు.

చదువులమ్మకు స్వర్ణ పతకం

- ఏళ్ల కృషికి, పట్టుదలకు పట్టాభిషేకం
- గవర్నర్ నుంచి స్వర్ణ పతకాల స్వీకరణ



పదో స్నాతకోత్సవంలో గ్రూప్ ఫొటో దిగిన కులపతి, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప కులపతి ప్రసాదరాజు, పాలక మండలి సభ్యులు, డైరెక్టర్లు

బాలాజీచెరువు: చదువుల సరస్వతుల హర్షధ్వానాలతో స్థానిక జేఎన్‌టీయూకే ప్రాంగణం దద్దరిల్లిపోయింది. జేఎన్‌టీయూకే కాన్వొకేషన్ హాల్లో బుధవారం 10 స్నాతకోత్సవం కన్నుల పండగగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు చూస్తుండగా విద్యార్థులు సగర్వంగా పట్టాలు అందుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకాలు, పీహెచ్‌డీలు అందుకున్న కొందరు భావోద్వేగానికి గురయ్యారు. అరుదైన సన్నివేశాలు, సెల్ఫీలు తమ సెల్‌ఫోన్లలో బంధించి మురిసిపోయారు. పట్టరాని ఆనందాలను వారి అభిప్రాయాల్లో..

ఫార్మసీలో పీహెచ్‌డీ చేస్తా



నాపేరు ఎం.ప్రియదర్శిని. ఫార్మసీలో సాల్యుబిలిటీ డిసొల్యూషన్ రేటు పెంపుదల, ఫార్మలేషన్ అభివృద్ధి, స్వచ్ఛదంగా కరిగే బీసీఎస్ క్లాస్–2 అంశంపై సిద్ధాంత వ్యాసం రచించాను. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ ప్రొఫెసర్ ఎ.ప్రమీలా రాణి పర్యవేక్షణలో సమర్పించాను. పీహెచ్‌డీ సాధించి కుటుంబ సభ్యుల సమక్షంలో తీసుకోవడం సంతోషంగా ఉంది. జీవితంలో ఇది మధుర ఘట్టంగా నిలిచిపోతుంది. విద్యతో అత్యుత్తమ అర్హత గల పీహెచ్‌డీ సాధించడం జీవితాశయంగా పెట్టుకుని సాధించాను. నా భర్త సహకారంతో ఇది సాధ్యమైయింది.

చాలా సంతోషంగా ఉంది



నాపేరు గుడాల దివ్య, బీటెక్ సివిల్ ఇంజినీరింగ్‌లో జేఎన్‌టీయూకేలో 9.37శాతం ఉత్తీర్ణత సాధించి స్వర్ణ పతకాన్ని గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది. టీసీఎస్‌లో ఉద్యోగం సాధించాను. గేట్ రాసి ఎంటెక్ చదవాలనుకుంటున్నాను.

సమాజ సేవే లక్ష్యం



నా పేరు సయ్యద్ అష్రఫ్. ప్రకాశం జిల్లా కందుకూరి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మైనింగ్ ఇంజినీరింగ్‌లో 7.38 శాతం సాధించి స్వర్ణ పతకం సాధించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి సమాజ సేవ చేయాలనేది నా లక్ష్యం.

రెండు స్వర్ణాలు సాధించా



నా పేరు బి.దుర్గాభవాని. పెట్రోలియం ఇంజినీరింగ్‌లో 8.92 ఉత్తీర్ణతతో స్వర్ణ పతకం, ఎండోమెంట్‌లో మరో స్వర్ణ పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. డీఎ లయిట్‌తో సాఫ్ట్‌వేర్ ఐదు లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాను. జీవితంతో మరిచిపోలేని అనుభూతిగా ఈ వేడుక నిలిచిపోతుంది.